క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ నాయకుల సమావేశం నేడు

హుకుంపేట: మండల కేంద్రంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులతో ఆదివారం అత్యవసర సమావేశం నిర్వహిస్తున్నట్టు మండల పార్టీ అధ్యక్షుడు పాంగి అనిల్ ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించే సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులతో పాటు ప్రదాన నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని పిలుపునిచ్చారు.

ప్రభుత్వ భూమి స్వాధీనం



ఆక్రమిత ప్రభుత్వ భూమిలో బోర్డును ఏర్పాటు చేయిస్తున్న తహసీల్దార్ రాజ్‌కుమార్, సిబ్బంది

జి.మాడుగుల: మండలంలో కేంద్రంలో ఆక్రమణకు గురైన 30 సెంట్లు ప్రభుత్వ భూమిలో ఆక్రమణలు తొలగించి ప్రభుత్వ భూమి స్వాధీనం చేసుకున్నట్టు తహసీల్దార్ జి.రాజ్‌కుమార్ తెలిపారు. మండలంలో ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలు గుర్తించి నోటీసులు జారీ చేస్తున్నామన్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి సమస్యలు



ఎంపీడీవో ప్రేమ్‌సాగర్‌కు వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నేతలు

ఎటపాక: మండలంలోని గుండాల పంచాయతీలో రహదారుల సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని ఎంపీడీవో ప్రేమ్‌సాగర్ హామీ ఇచ్చారు. పంచాయతీలో రహదారులు నిర్మించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా చేస్తున్న రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని ఎంపీడీవో ప్రేమ్‌సాగర్ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా దీక్ష చేస్తున్న వారిని వివరాలు అడిగి తెలుసుకుని వారి నుంచి వినతిపత్రాన్ని స్వీకరించారు. గ్రామాల్లో రహదారులు, ఇసుక సమస్యలను ఎంపీడీవోకు విన్నవించారు. దీనిపై ఆయన స్పందించి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. నాయకులు ఐవి, అజయ్, సత్యం, వెంకటేష్, వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



వాహన తనిఖీలు చేస్తున్న మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు లీలాప్రసాద్, వాసు

పాడేరు : వాహనదారులు ఖచ్చితంగా రహదారి భద్రత నియమాలు, ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని లేని పక్షంలో కఠిన చర్యలు తప్పవని మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు ఎస్.లీలాప్రసాద్, కోడి వాసు హెచ్చరించారు. శనివారం జిల్లా కేంద్రమైన పాడేరు నుంచి అరకు, విశాఖపట్నం, చింతపల్లి వెళ్లే మార్గాల్లో రవాణ శాఖ, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో వాహన తనిఖీలు చేపట్టారు. ఆయా మార్గాల్లో రాకపోకలు సాగిస్తున్న వాహనదారులకు కౌన్సెలింగ్ చేపట్టారు. ఆయా మార్గాల్లో నిబంధనలు పాటించని వాహనదారులకు రూ. 1.40లక్షల జరిమానా విధించారు. నిబంధనలు పాటించని వాహనాలను సీజ్ చేసి ఆర్టీసీ డిపో ప్రాంగాణంలో ఉంచామన్నారు.

హెచ్‌ఎంగా ఆదిలక్ష్మి నియామకం



రాజవొమ్మంగి: స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా ఏ.ఆదిలక్ష్మి శనివారం నియమితులయ్యారు. బదిలీ ప్రక్రియ, కౌన్సెలింగ్‌లో భాగంగా ఆమె రాజోలు గరల్స్ హైస్కూల్ నుంచి ఇక్కడకు ట్రాన్స్‌ఫర్ అయ్యారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేస్తున్న హెచ్‌ఎం గోపాలకృష్ణ కోనసీమ జిల్లా కాలేరు జెడ్పీ హైస్కూల్‌కు బదిలీ అయ్యారు.

పాముకాటుతో వ్యక్తి మృతి



మృతుడు రమేష్

మోతుగూడెం: వై రామవరం మండలం బొడ్డగండి పంచాయతీ డొంకరాయి గ్రామానికి చెందిన పాంగి రమేష్ అనే వ్యక్తికి శుక్రవారం రాత్రి పాము కాటేయడంతో మృతి చెందాడు. కుటుంబంతో కలిసి ఇంట్లో బొంత వేసుకుని కింద నిద్రిస్తుండగా పాము మృతుడు రమేష్ వీపు వెనక భాగాన కాటేసింది. ఆయనను హుటాహుటిన డొంకరాయి గ్రామంలోని జెన్‌కో ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేయించిన అనంతరం చింతూరు సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రమేష్ శనివారం ఉదయం చెందినట్టు కుటుంబసభ్యులు తెలిపారు. మృతుడి భార్య మంజుల ఇచ్చిన ఫిర్యాదుపై డొంకరాయి ఎస్‌ఐ శివకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వెతలు తీరేనా?



స్వీపర్ లేకపోవడంతో ఆస్పత్రిని శుభ్రం చేస్తున్న ఎంఎన్‌వో రాజారావు



సీలేరు పీహెచ్‌సీ

సీలేరు పీహెచ్‌సీలో సిబ్బంది కొరత

రోగులకు తప్పని ఇబ్బందులు

పట్టించుకోని అధికారులు

సీలేరు: అల్లూరి జిల్లా ఒడిశా సరిహద్దు సీలేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిత్యం రోగులతో రద్దీగా ఉంటుంది. 24 గంటలు రోగులకు వైద్య సేవలు అందించాల్సిన పరిస్థితుల్లో కింది స్థాయి సిబ్బంది లేక ఆస్పత్రిలో అవస్థలు పడుతున్నారు. నిత్యం ఏదో ఒక సమస్యతో ఆస్పత్రికి వచ్చే రోగులకు ఇక్కడ సిబ్బంది కొరతతో వేచి ఉండే పరిస్థితి నెలకొంది. ఆస్పత్రిలో వైద్యాధికారులు, స్టాఫ్ నర్సులతో పాటు కిందిస్థాయి వాచ్‌మెన్, ఎంఎన్‌ఓ, ఎఫ్‌ఎన్‌వోలు ఉండాలి. ఇక్కడి ఆస్పత్రికి చెందిన ఇద్దరు కిందిస్థాయి ఉద్యోగులు వేరేచోట విధులు చేస్తున్నట్టు పలువురు ఆరోపిస్తున్నారు.దీంతో ఆస్పత్రిలో మిగిలిన సిబ్బందిపై పనిభారం పడుతుందని చెబుతున్నారు. డిప్యూటేషన్‌పై వెళ్లిన వారిని తిరిగి ఇక్కడి ఆస్పత్రికి యథాస్థానంలో తీసుకురావాలని కోరుతున్నారు. ఆస్పత్రిలో సిబ్బంది కొరతపై అధికారులకు పలుమార్లు వినతులిచ్చినా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సీలేరు పీహెచ్‌సీలో సిబ్బంది కొరత వల్ల ఎంఎన్‌వో అన్ని పనులు చేయాల్సి వస్తోంది. ఆస్పత్రి శుభ్రం చేయడం, ఓ.పి కేసుల వివరాల నమోదు, గాయాలైన వారికి కట్టుకట్టడం వంటి పనులు చేయాల్సి వస్తోందని పలువురు చెబుతున్నారు. వాచ్‌మెన్, ఎఫ్‌ఎన్‌వో డిప్యూటేషన్‌పై వెళ్లడంతో ఈ సమస్య ఎదురైందంటున్నారు. ఒకవేళ ఎంఎన్‌వో సెలవులో ఉంటే ఆస్పత్రిని శుభ్రం చేసే సిబ్బంది లేక పారిశుధ్య సమస్య లోపిస్తుందని చెబుతున్నారు.

రాత్రిళ్లు భయంతో విధులు

సీలేరు ఆస్పత్రిలో ఇద్దరు వైద్యాధికారులతో పాటు స్టాఫ్ నర్సులు ముగ్గురు ఉన్నారు. వీరికి సహాయకులుగా ఒక ఎంఎన్‌వో మరొకరు ఎఫ్‌ఎన్‌ఓ ఉండాలి. నాలుగేళ్ల కిందటే ఎఫ్‌ఎన్‌వో డిప్యుటేషన్ వెళ్లడంతో స్టాఫ్ నర్సులుపై పనిభారం పడుతుందని స్థానికులు చెబుతున్నారు. ఇక్కడ వాచ్‌మెన్ లేకపోవడంతో రాత్రిళ్లు విధులు నిర్వహిస్తున్న స్టాఫ్ నర్సులు, సిబ్బంది భయంతో విధులు చేయాల్సి వస్తోందని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైన వైద్యశాఖాధికారులు స్పందించి డిప్యుటేషన్‌పై వెళ్లిన వారిని యధావిధిగా సీలేరు పీహెచ్‌సీలో నియమించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయంపై అడిషనల్ డీఎంహెచ్‌ఓ ప్రతాప్ మాట్లాడుతూ తక్షణమే ఆ ఇద్దరు డిప్యుటేషన్లను రద్దు చేయడమో లేక కొత్తవారిని నియమించడం చేస్తామన్నారు. ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న స్టాఫ్ నర్సులకు, రోగులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు.



దెబ్బలు తగిలిన వ్యక్తికి కట్టు కడుతున్న ఎంఎన్‌వో రాజారావు

ఏజెన్సీలో ప్రత్యేక డీఎస్సీపై జీపుజాత



జీపుజాత పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆదివాసీ స్పెషల్ డీఎస్సీ సాధన కమిటీ ప్రతినిధులు ధర్మన్నపడాల్, నారాయణరాజు తదితరులు

జి.మాడుగుల: ప్రభుత్వం ఏజెన్సీలో ప్రత్యేక డీఎస్సీ ప్రకటించాలని డిమాండ్‌తో ఆదివాసీ స్పెషల్ డిఎస్సీ సాధన కమిటీ ఆధ్వర్యంలో మే 31 నుంచి జూన్ 4వ తేదీ వరకు జీపుజాత నిర్వహిస్తున్నట్టు కమిటీ ప్రతినిధులు సాగిన ధర్మన్నపడాల్, మత్స్యరాస నారాయణరాజు, లకే రామకృష్ణ చెప్పారు. ఈ మేరకు మండల కేంద్రంలో శనివారం జరిగిన కార్యక్రమంలో జీపుజాత పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం గిరిజన అభ్యర్థుల కోం ప్రత్యేక డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని, ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన డీఎస్సీ నుంచి ఆదివాసీ ప్రాంత టీచర్స్ పోస్టులు మినహించాలని, అయిదవ షెడ్యూల్ ప్రాంతంలో నూరుశాతం ఉద్యోగ నియామక చట్టం చేయాలని డిమాండ్ చేశారు. జీపుజాత కార్యక్రమం సీతంపేట ఐటీడీఏ వద్ద ప్రారంభమై సాలూరు మీదుగా అల్లూరి సీతారామరాజు రాజవొమ్మంగి, రంపచోడవరం, చింతూరు ఐటీడీఏలను సందర్శిస్తూ జూన్ 4న వి.ఆర్.పురం ఐటీడీఏ వద్ద ముగిస్తుందన్నారు. ఇందులో భాగంగా జి.మాడుగుల మండల కేంద్రంలో జూన్ 2న మధ్యాహ్నం సమావేశం నిర్వహించనున్నట్టు తెలిపారు. అన్ని ప్రజాసంఘాలు, యువత, మేధావులు, డీఈడీ, బీఈడీ అభ్యర్థులు, విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఆదివాసీ స్పెషల్ డిఎస్సీ సాధన కమిటీ ప్రతినిధి మత్స్యరాజు, లువ్వాసింగి ఎంపీటీసీ గబ్బాడి సన్యాసిదొర, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు శంకయ్య, సూర్యప్రకాష్ నాయుడు, పీసా కమిటీ ఉపాధ్యక్షులు చిరంజీవినాయుడు, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం



యోగా చేస్తున్న విద్యార్థులు

కొయ్యూరు: కిశోర బాలికలు చదువుతో పాటు ఆటల్లోనూ రాణించాలని సీడీపీవో విజయకుమారి కోరారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆమె చిన్నారులకు యోగాపై శనివారం అవగాహన కల్పించారు. యోగా చేయడం వల్ల కలిగే ఉపయోగాలను వివరించారు. చిన్నారులకు యోగాసనాలు వేయించారు. క్రీడలపై కూడా దృష్టి సారించాలని, దీంతో మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. సూపర్‌వైజర్లు మహాలక్ష్మి, భవానీ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఆక్రమణల తొలగింపు



రంపచోడవరంలో ఆక్రమణల తొలగింపు

రంపచోడవరం: రంపచోడవరంలో అక్రమణల తొలగింపు కొనసాగుతోంది. ఇందులో భాగంగా అంబేడ్కర్ సెంటర్ నుంచి దేవీపట్నం వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలను రెవెన్యూ అధికారుల పర్యవేక్షణలో తొలగించారు. అంబేడ్కర్ సెంటర్‌లో చాలా వరకు షెడ్లు, ఆక్రమిత భవనాలను తొలగించారు.పందిరిమామిడి నుంచి మారేడుమిల్లి రోడ్డు, ఏపీ గురుకుల పాఠశాల వరకు , దేవీపట్నం రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలు తొలగించారు. రెండు, మూడు రోజుల్లో పూర్తిగా ఆక్రమణలు తొలగించేలా అధికారులు చర్యలు చేపడుతున్నారు.

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగ కమిటీ ప్రతినిధులకు సన్మానం



అరకు పార్లమెంట్ పరిశీలకులు బొడ్డేడ ప్రసాద్‌ను సన్మానిస్తున్న పాడేరు, అరకు ఎమ్మెల్యేలు, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, మాజీ ఎంపీ, ఎమ్మెల్యేలు

సాక్షి,పాడేరు: వైఎస్సార్‌సీపీలో కీలక పదవులు పొందిన నేతలకు శనివారం పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు క్యాంపు కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. అరకు పార్లమెంట్ పరిశీలకుడుగా నియమితులైన బొడ్డేడ ప్రసాద్, రాష్ట్ర మహిళా విభాగం జోనల్ సెక్రటరీగా నియమితులైన ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అచ్యుత్ రామారాజులను అరకు, పాడేరు ఎమ్మెల్యేలు రేగం మత్స్యలింగం, మత్స్యరాస విశ్వేశ్వరరాజు, మాజీ ఎంపీ గొడ్డేటి మాధవి, ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, నాయకులు ఘనంగా సన్మానించారు. సర్పంచ్‌లు, జెడ్పీటీసీ సభ్యులు, నాయకులు రేగం చాణక్య తదితరులు పాల్గొన్నారు.



పార్టీ మహిళా విభాగం జోనల్ సెక్రటరీ సుభద్రను సన్మానిస్తున్న అరకు పార్లమెంట్ పరిశీలకులు బొడ్డేడ ప్రసాద్, పాడేరు, అరకు ఎమ్మెల్యేలు, మాజీ ఎంపీ, ఎమ్మెల్యేలు

గ్రామాల్లో పింఛన్ల పంపిణీ

పెదబయలు/కొయ్యూరు: పెదబయలు మండలంలోని సీతగుంట పంచాయతీ ముసిడిపుట్టు, కొయ్యూరు మండలంలోని మూలపేట, గదబపాలెం పంచాయతీ మల్లవరం గ్రామాల్లో శనివారం పింఛన్ల పంపిణీ జరిగింది. ఆర్టీసీ జోన్-1 రీజనల్ చైర్మన్ దొన్నుదొర, ఎంపీడీవోలు, పూర్ణయ్య, ప్రసాద్, ఈవోఆర్‌డీ నర్సింగరావు, డీటీ వెంకటరమణ, సర్పంచ్ మాధవరావు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధాన్ని అతిక్రమిస్తే చర్యలు

సాక్షి ఎఫెక్ట్..

ముంచంగిపుట్టు: ప్లాస్టిక్ నిషేదానికి అందరు సహకరించాలని, అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ఎంపీడీవో సూర్యనారాయణమూర్తి అన్నారు. మే 27న ప్లాస్టిక్ నిషేధం..కాగితాలకే పరిమితం అంటూ 'సాక్షి' దిన పత్రికలో వచ్చిన కథనానికి ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శులు స్పందించారు. ఈ మేరకు మండల కేంద్రంలో జరుగుతున్న వారపు సంతలో పాలిథిన్ కవర్లు, ప్లాస్టికవస్తువులపై తనిఖీలు నిర్వహించారు. భారీ సంఖ్యలో పాలిథిన్ కవర్లను స్వాధీనం చేసుకున్నారు. ప్లాస్టిక్ కలిగే అనర్థాలపై వారపు సంతలోని వ్యాపారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సూర్యనారాయణమూర్తి మాట్లాడుతూ వారపు సంతలో పాలిథిన్ కవర్లు వినియోగం అధికంగా ఉందని, మొదటి తప్పుగా భావించి, ప్లాస్టిక్ కవర్ల అమ్ముతున్న వ్యాపారులను హెచ్చరించి విడిచి పెట్టడం జరుగుతుందన్నారు.రానున్న రోజుల్లో పాలిథిన్ కవర్లు అమ్మితే భారీగా జరిమానా వేస్తామని వ్యాపారులకు హెచ్చరించారు. పంచాయతీ కార్యదర్శులు సింహచలం, కిరణ్‌లున్నారు.



వారపు సంతలో తనిఖీలు చేస్తున్న ఎంపీడీవో సూర్యనారాయణమూర్తి తదితరులు

మెరుగైన వైద్యం అందించాలి

అరకులోయటౌన్: అరకులోయ ఎంపీపీ రంజపల్లి ఉషారాణి ఆస్పత్రిలో పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. విషయం తెలుసుకున్న అరకులోయ ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం అరకు ఏరియా ఆస్పత్రికి వెళ్లి ఎంపీపీ ఉషారాణితో మాట్లాడారు. తల్లి బిడ్డ ఆరోగ్యంపై ఆరా తీశారు. తల్లి బిడ్డకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. వైద్యుల సలహాలు, సూచనలు పాటించి, తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీపీకి సూచించారు. ఎమ్మెల్యే వెంట ఉమ్మడి విశాఖ జిల్లా ఎస్టీ సెల్ మాజీ అధ్యక్షుడు కమిడి అశోక్, అరకులోయ, డుంబ్రిగుడ మండల పార్టీ అధ్యక్షులు స్వాభి రామ్మూర్తి, పాంగి పరశురామ్, నాయకులు నరసింహమూర్తి, కిల్లో జగన్, తదితరులున్నారు.



ఎంపీపీ ఉషారాణితో మాట్లాడుతున్న అరకు ఎమ్మెల్యే మత్స్యలింగం

డీఆర్ డిపోల్లో జీసీసీ ఉత్పత్తుల విక్రయాలు



మాట్లాడుతున్న జీసీసీ డీఎం వెంకటేశ్

కొయ్యూరు: డీఆర్ డిపోల్లో జీసీసీ ఉత్పత్తులను విక్రయిస్తున్నట్టు చింతపల్లి జీసీసీ డీఎం బి.వెంకటేష్ తెలిపారు. మండల కేంద్రంలోని జీసీసీ కార్యాలయంలో సేల్స్‌మెన్లు, డీలర్లతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక జీసీసీ బీఎం విజయకుమార్‌తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. జీసీసీ తయారుచేసిన సబ్బులు, షాంపూలు, పసుపు, కాఫీతో పాటు అనేక వస్తువులను డిపోల వద్ద విక్రయిస్తామన్నారు. చాలా చోట్ల డిపోల భవనాలు పాడై ఉన్నాయని, అలాంటి చోట్ల అద్దెకు భవనాలు తీసుకోవాలని సూచించారు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. సేల్స్‌మెన్లు డిపోలను సకాలంలో తెరవాలని, సమయపాలన పాటించాలన్నారు. డీఆర్‌ను పెంచాల్సి ఉంటుందన్నారు. ఎవరిపైనా ఫిర్యాదులు వచ్చినా చర్యలు తీసుకుంటామన్నారు. అటవీ ఉత్పత్తులు, ఫలసాయం కొనుగోలుకు వీలుగా కొయ్యూరు, గూడెంకొత్తవీధి, చింతపల్లి బీఎంలతో సమావేశం ఏర్పాటు చేసి వివరాలు తీసుకుంటున్నామన్నారు. మంపకు సంబంధించి పి.గంగవరం, ఆర్.దొడ్డవరం, తీతిపిట్ల గ్రామస్తులకు రేషన్ సరకులను యూ.చీడిపాలెం డిపో నుంచి ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ ఏడాది చింతపల్లి పరిధిలో ఏడువేల టన్నుల కాఫీని కొనుగోలు చేశామని జీసీసీ డీఎం వెంకటేశ్ చెప్పారు. రైతులకు మంచి గిట్టుబాటు ధరలు ఇచ్చామన్నారు. కొయ్యూరు మండలంలో 5.3 టన్నుల కాఫీ, 50 క్వింటాళ్ల పసుపు, పది క్వింటాళ్ల చింతపండును కొనుగోలు చేశామన్నారు. ఈ ఏడాది డిసెంబర్‌లో కొనుగోలు చేసే కాఫీకి సంబంధించి ముందస్తుగా చర్యలు తీసుకుంటామన్నారు.

ఆక్రమణల తొలగింపునకు చర్యలు

చింతూరు: జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశాల మేరకు మండలంలోని పలు గ్రామాల్లో ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న ఆక్రమణల తొలగింపునకు చర్యలు చేపట్టినట్లు తహసీల్దార్ చిరంజీవి శనివారం తెలిపారు. ఇందులో భాగంగా చింతూరులో 246, మోతుగూడెంలో 66, ఎర్రంపేటలో 64, చట్టిలో 51, ఏడుగురాళ్లపల్లిలో 8, తుమ్మలలో 6 మందికి నోటీసులు జారీ చేసినట్టు ఆయన తెలిపారు. ప్రధాన రహదారి మధ్య నుంచి ఇరువైపులా 15 మీటర్ల లోపుల ఉన్న అన్ని ఆక్రమణలను తొలగించినట్టు ఆయన తెలిపారు. నోటీసులు అందుకున్నవారు 15 రోజుల్లోగా స్వచ్ఛందంగా ఆక్రమణలు తొలగించుకోవాలని లేనిపక్షంలో రెవెన్యూ, పంచాయతీరాజ్, పోలీసు శాఖల ఆధ్వర్యంలో ఆక్రమణలు తొలగిస్తామని తహశీల్దార్ చిరంజీవి హెచ్చరించారు. దీనిపై త్వరలోనే ఆక్రమణ దారులతో సమావేశం నిర్వహించి వారికి ఆక్రమణల తొలగింపుపై అవగాహన కల్పిస్తామని ఆయన తెలిపారు.

డిపోల వద్ద రేషన్ సరకుల అందజేత

ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల నుంచి రేషన్ డిపోల వద్దనే రేషన్ సరకులు అందచేయనున్నట్టు తహసీల్దార్ చిరంజీవి తెలిపారు. మండలంలోని 23- జీసీసీ, 59-ప్రైవేటు డీలర్లకు సంబంధించిన రేషన్‌షాపులకు సంబంధించి 12,094 రేషన్ కార్డులున్నట్లు ఆయన తెలిపారు. వీరందరూ ఈ నెల నుండి డిపోల వద్దకు వెళ్లి రేషన్ సరకులు తీసుకోవాలని, 65 ఏళ్ల పైబడిన వృద్ధులు, దివ్యాంగుల ఇంటికి వెళ్లి రేషన్ సరకులను డీలర్లు అందజేయనున్నట్టు తహశీల్దార్ చిరంజీవి తెలిపారు.



చింతపల్లిలో జెడ్పీటీసీ తదితరులతో మాట్లాడుతున్న వ్యాపారులు

చింతపల్లి: మండల కేంద్రంలో ప్రభుత్వ భూముల్లో ఆక్రమణ తొలగింపుపై రెవెన్యూ అధికారులు చర్యలు చేట్టారు. ఆక్రమిత ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవాలని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేయడంతో శనివారం నుంచి చింతపల్లి మండల కేంద్రంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. దీనిపై పలువురు వ్యాపారాలు, గృహ యజమానులు స్థానిక ప్రజాప్రతినిధులను ఆశ్రయించారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే మత్యరాస విశ్వేశ్వర రాజుకు వివరించారు. వెంటనే స్పందించి ఆయన కలెక్టర్ దినేష్‌కుమార్‌ను కోరారు. దీనిపై రెండు, మూడు రోజుల్లో ఆక్రమణలను స్వచ్ఛందంగా తొలగించకుంటే చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. సర్పంచ్ దురియా పుష్పలత, జెడ్పీటీసీ సభ్యులు బాలయ్య, వినాయకరావు, వర్తక సంఘం నాయకులు బేతాలుడు, నాగేశ్వరరావు, గ్రామ పెద్దలు రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి జాతరకు సర్వం సిద్ధం

- నేటి నుంచి కనకదుర్గమ్మ తల్లి ఉత్సవాలు
- పూర్తయిన ఏర్పాట్లు

ముంచంగిపుట్టు: మండలంలోని జోలాపుట్టు పంచాయతీ కేంద్రంలో వెలసిన కనకదుర్గమ్మ అమ్మవారి ఉత్సవాలను ఈ నెల 1 నుంచి 3వ తేదీ వరకు మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించడానికి ఉత్సవ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఏటా కనకదుర్గమ్మ అమ్మవారి ఉత్సవాలను సరిహద్దు గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాల ప్రకారం పెద్ద ఎత్తున జరుగుతాయి. జోలాపుట్టులో కొలువైన కనకదుర్గమ్మ అమ్మవారి ఉత్సవాలను ఎంతో ఘనంగా గ్రామస్తులు నిర్వహిస్తారు. వేడుకల్లో భాగంగా అమ్మవారికి తొలి పూజ, ఉత్సవ విగ్రహం ఊరేగింపు తదితర కార్యక్రమాలు చేస్తారు. వేడుకకు సరిహద్దు గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వస్తారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేశారు. అమ్మవారి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తులు ఇబ్బందులు లేకుండా ఉత్సవ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు.



ప్రత్యేకాలంకరణలో కనకదుర్గమ్మ అమ్మవారు

ఆదివాసీ జేఏసీ ఉద్యమాలకు మండల సర్పంచ్‌ల ఫోరం మద్దతు

జి.మాడుగుల: ఆదివాసీ జెఏసీ ఉద్యమానికి జి.మాడుగుల మండల సర్పంచ్‌ల ఫోరం సంపూర్ణ మద్దతు ఉంటుదని సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు సురభంగి రామకృష్ణ తెలిపారు. స్థానిక గ్రామ సచివాలయంలో శనివారం ఏపీ ఆదివాసీ జేఏసీ చేస్తున్న న్యాయమైన పోరాటానికి సర్పంచ్‌ల ఫోరం మద్దతు తెలియజేసింది. మండలానికి చెందిన సర్పంచ్‌లతో ఏపీ ఆదివాసీ జేఏసీ జిల్లా చైర్మన్ రామన్నదొర, మేధావుల కమిటీ సభ్యుడు మినుముల ప్రసాదరావు సమావేశమయ్యారు. ఆదివాసీ భావి తరాలకు శాశ్వత ఉద్యోగ నియమకాల చట్టం తీసుకురావటానికి ఆదివాసీలతో కలసి ప్రత్యక్ష ఉద్యమాలపై చర్చాంచారు. ఉద్యమాలకు ప్రతీ పంచాతీలో ప్రతి కుటుంబం నుంచి రూ.10 చొప్పున విరాళం సమీకరించి జెఏసీకి అందజేయనున్నట్టు తీర్మానించారు. రామన్నదొర మాట్లాడుతూ ఆదివాసీ హక్కులు పరిరక్షణకు జెఏసీ చేస్తున్న ఉద్యమానికి సంపూర్ణ మద్దతు ప్రకటించిన సర్పంచ్‌ల ఫోరంను ఆయన అభినందించారు. సర్పంచ్‌లు కిముడు రాంబాబు,ఐసరం హనుమంతరావు, సీదరి కొండబాబు, సూరిబాబు, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.



జి.మాడుగులలోని సమావేశంలో సర్పంచ్‌లతో కలిసి మాట్లాడుతున్న ఆదివాసీ జేఏసీ జిల్లా చైర్మన్ రామన్నదొర

చింతూరు: ఆదివాసీలు చేస్తున్న ఉద్యమాల్లో యువత అధిక సంఖ్యలో పాల్గొని చట్టాలు, హక్కులు సాధనకు కృషి చేయాలని ఆదివాసీ జేఏసీ మండల కార్యదర్శి కాక సీతారామయ్య అన్నారు. స్థానిక ఐటీడీఏ ఎదుట జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దీక్షల్లో భాగంగా శనివారం గిరిజన సంఘం నాయకుడు సీసం సురేష్, న్యాయవాదులు రవితేజ, నవీన్ పాల్గొని మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా సీతారామయ్య మాట్లాడుతూ బినామీ పేర్లతో వున్న అక్రమ కట్టడాలను తొలగించాలని, ఆదివాసీ చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. లెనిన్, సాయిబాబు, రాజు, చంద్రయ్య, నాగేష్, హర్ష, సాయి పాల్గొన్నారు.



చింతూరులో దీక్షలు చేస్తున్న జేఏసీ నాయకులు

పవనగిరి క్షేత్రాన్ని సందర్శించిన షణ్ముఖ పీఠాధిపతి



పవనగిరి క్షేత్ర వ్యవస్థాపకులు వెంకటరామయ్య, భక్తులతో షణ్ముఖ పీఠాధిపతులు స్కంద స్వామీజీ తదితరులు

అడ్డతీగల: ఏజెన్సీలోని ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రమైన అడ్డతీగలలోని పవనగిరి క్షేత్రాన్ని రాజమహేంద్రవరానికి చెందిన షణ్ముఖ పీఠాధిపతి స్కంద స్వామీజీ శనివారం సందర్శించారు. ఆలయంలో కొలువుదీరిన సరస్వతిదేవీకి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో భక్తులతో కలసి పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణకు షణ్ముఖ పీఠం నుంచి భవిష్యత్‌లో పవనగిరి క్షేత్రానికి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. పవనగిరి క్షేత్రం వ్యవస్థాపకులు తణుకు వెంకటరామయ్య, విజయలక్ష్మి దంపతులు స్కంద స్వామీజీని దుశ్శాలువాతో సత్కరించారు.